కథ

# మోహన్రావు- మొబైల్ ఫోనూ

నీలిమ

ప్రపంచం అంతా మొబైల్ ఫోన్లపై నడుస్తున్నా మోహన్రావు మాత్రం మొబైల్‌ఫోన్ అంటే మొహం చిట్లిస్తాడు. కొలీగ్స్ అంతా మొబైల్ ఫోన్ కొనుక్కోమని చెవిలో ఇల్లు కట్టుకుని చెప్పినా విన్లేదు, తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న మోహన్రావుకి మంచి జీవితం వున్నా ల్యాండ్‌లైన్‌తో నడుస్తుందిలే అనుకుంటూ కాలం వెల్లదీసే చిత్రమైన మనిషి. ఏదైనా ఒక వస్తువు కొనాలంటే ఒకటికి వందసార్లు ఆలోచిస్తాడే గానీ వెంటనే కొనడు. ఉపయోగపు విలువకే ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తి అతను. అయితే కూతురు హిమ కెనెడా వెళ్లినప్పటినుంచీ తండ్రితో మాట్లాడాలంటే ఇబ్బందిగా వుండడంతో మొబైల్ కొనుక్కోమని ఒత్తిడి చేయడం మొదలు పెట్టింది. ల్యాండ్‌లైన్‌కి కాల్ చేసినప్పుడు మోహన్రావు ఇంట్లో లేకపోవడం, అతను ఇంట్లో వుండే సమయం చూసుకుని ఫోన్ చేయాల్సి రావడం లాంటి సమస్యల వల్ల ఆ అమ్మాయికి కమ్యూనికేషన్ పెద్ద ప్రాబ్లం అయి కూర్చుంది. అందుకే మొబైల్ ఫోన్ కొంటే ఎప్పుడూ అందుబాట్లో వుండవచ్చని ఏ సమయంలోనైనా ఫోన్‌లో మాట్లాడుకోవచ్చనీ తండ్రికి నూరిపోసి ఎలాగో ఒప్పించగలిగింది. అదుగో అప్పట్నుంచే మోహన్రావు మొబైల్ ఫోన్ కొనాలని నిశ్చయించుకున్నాడు.

భార్య చనిపోయేప్పటికి హిమకి పదిహేనేళ్ళ వయసు. గారాబంగా పెంచి ఆశలన్నీ కూతురిపైనే పెట్టుకున్న మోహన్రావుకి కూతురు తనని ఒంటరిగా వదిలి ఉద్యోగం కోసం కెనెడా వెళ్లిపోవడం వల్ల రోజూ ఫోన్ ద్వారా కూతురి క్షేమసమాచారాన్ని తెల్సుకోవాలంటే ఇప్పుడు మొబైల్ ఫోన్ నెససరీ అనిపించగానే, 'ఏ ఫోన్ బాగుంటుంది, ఎక్కడ కొంటే మంచిది, ఏ షాపు వాళ్ళు మోసం చేయకుండా వుంటారు' ఇలాంటి వివరాలన్నీ తెల్సుకోడానికి ఓ నెల రోజులు పట్టిందతనికి. ఎమ్మే డిగ్రీలో గోల్డ్ మెడలిస్ట్ అయినా మోహన్రావుకి ఎలక్ట్రానిక్స్ విషయంలో 'అ ఆ'లే తెలీవు. కనీసం కంప్యూటర్ ఆపరేటింగ్ నేర్చుకోమని, బేసిక్ పరిజ్ఞానమైనా ఈ రోజుల్లో వుండాలనీ స్నేహితులు ఎంత చెప్పినా పెడచెవిన పెట్టేశాడు. ఇప్పుడు మొబైల్ కొన్నాక దాన్ని ఎలా ఆపరేట్ చేయాలో తెల్సుకోవాలంటే చాలా కష్టం అనిపించిందతనికి, ఎస్సెమ్మెస్ ఇవ్వడం, ఫోన్ బుక్‌లో నెంబర్ ఫీడ్ చేసుకోవడం అతనికి కత్తిమీద సాముగా తోచి, అలాంటి విషయాలకి స్నేహితులపై ఆధారపడడమే మంచిదనిపించింది. ఎప్పుడూ జేబులో పాకెట్ ఫోన్ డైరీ వుంచుకుని ఎవరికైనా ఫోన్ చేయాలనుకున్నప్పుడు ఆ డైరీ తీసి నెంబరు నొక్కి ఫోన్ చేసే మోహన్రావుని అతని స్నేహితులు ఆటపట్టిస్తుంటారు. వాళ్ళు నవ్వినందుకు నొచ్చుకోకుండా వాళ్లతో తానూ శృతి కలిపేసి నవ్వేస్తాడు. కొందరైతే అతనికి 'అమాయక చక్రవర్తి' అని బిరుదాంకితం చేసేసారు కూడా.

మొబైల్ ఫోన్ కొన్నాక కూతురితో ఏ సమయంలోనైనా మాట్లాడగలుగుతున్నాడు, అయితే ఈ మధ్య మోహన్రావుకి కొత్త సమస్య వచ్చి పడింది. అది 'కాలర్‌ట్యూన్'. ఆ మధ్య ఒక స్నేహితుడికి ఫోన్ చేస్తే వెంటేనే అవతలనుంచి ఒక స్త్రీ స్వరం విప్పించింది.

''హలో! ఎవరు మాట్లాడేది'' అంటూ..

''నేను మోహన్రావుని మాట్లాడుతున్నా, కిరీటి లేడాండి'' అని అడిగాడు.

''హలో, ఎవరు మాట్లాడేది'' మళ్ళీ అదే స్వరం.

ఇలా మోహన్రావ్ మాటని పట్టించుకోకుండా అదే పనిగా అరిగిపోయిన టేప్‌రికార్డులా అదేమాట పలుకుతోంది అవతలి సెల్‌ఫోన్.

ఈ సారి గొంతు చించుకుని

''హలో..! కిరీటి వున్నాడాండీ..'' అని గట్టిగా అరిచాడు.

అవతల్నుంచి కిరీటి

''హలో కిరీటి స్పీకింగ్''

''కిరీటీ! నేన్రా మోహన్రావుని, ఎవరావిడ కనీసం బదులైనా ఇవ్వకుండా 'హలో, ఎవరు మాట్లాడేదీ' అంటూ కనీసం నాలుగుసార్లైనా అడుగుతూనే వుంది. తన ధోరణి తనదిగానే ఇవతల్నించి నా గొంతును కనీసం పట్టించుకోదు. నన్ను మాట్లాడనివ్వదు. నీ భార్య గొంతు నేను పోలుస్తాను గానీ ఈ గొంతెవరిదో కొత్తగా వుందే'' సందేహాన్ని అడిగాడు.


మోహన్రావు అంత గట్టిగా అరవడానికి కారణం అర్థమవగానే కిరీటి నవ్వేస్తూ,

''మోహనా, అది 'కాలర్‌ట్యూన్'రా. మనం ఫోన్ చేస్తే 'ట్రింగ్, ట్రింగ్'మంటూ అవతల వాళ్ళు ఫోన్ ఎత్తే వరకూ మోగుతుంది కదా, ఆ ట్రింగ్ ట్రింగ్ శబ్దానికి బదులు ఇలాంటి గమ్మత్తయిన టోన్స్ పెట్టుకునే సౌకర్యం మొబైల్ ఫోన్లకి వుంది. మనం డబ్బులు కడితే ఇలాంటివి రకరకాలవి పెట్టుకోవచ్చు. అదన్నమాట సంగతి.'' అంటూ 'కాలర్ ట్యూన్' గురించి వివరించాడు కిరీటి.

కాస్త అర్థం అయీ, ఇంకాస్త అర్థం కాక 'మనకెందుకులే' అనుకుని ఊరుకున్నాడు మోహన్రావు. ఒక రోజు బాత్రూంలో కొళాయి లీకవుతుంటే ప్లంబరుకి ఫోన్ చేశాడు. రింగ్ చేయగానే సినిమా హీరో కృష్ణ గొంతు విన్పించింది.

''నీ ఫోన్‌కోసం ఎంతకాలం నుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా.. పోనీ ఇప్పటికన్నా ఫోన్ చేశావ్.. చాలా సంతోషం.. ఈ రోజిప్పుడు ఫోనెత్తుతుంటే ఎంత ఆనందంగా వుందో తెల్సా.. అలా పక్కకెళ్లి..విశాలమైన మైదానంలోకెళ్లి..సెల్లు ఆన్ చేసి.. నా మనసులో వున్న మాటల్నీ నీతో చెప్తాను.. నువ్వు చెప్పే మాటల్నీ కూడా వింటాను.. మనిద్దరం అసలు చాలారోజులైంది మాట్లాడుకుని... ఇన్నాళ్లకి నువ్వు ఫోన్ చేశావ్.. చాలా థేంక్స్..''

గబుక్కున ఫోన్ కట్ చేసేశాడు. మతిపోయింది మోహన్రావుకి. ఒకసారి నంబరు చెక్ చేసుకున్నాడు, ప్లంబరుకి ఫోన్ చేస్తే హీరో కృష్ణకి కాల్ వెళ్లిందేమిటీ, అనుకుంటూ ఇలాంటి చిక్కులెన్ని ఎదుర్కోవాల్రా దేవుడా అని తల పట్టుకున్నాడు. ఇదే విషయం మర్నాడు కాలేజికి వెళ్లాక సుబ్బారావుతో చెప్పాడు, దీనికి సుబ్బారావు పడీ పడీ నవ్వాడు.



"మోహనా, అది 'కాలర్‌ట్యూన్'రా, నువ్వెప్పటికిలాంటివి తెల్సుకుంటావు?" అంటూ కాస్త జాలిగా చూసాడు. ఈ విషయాన్ని లంచ్ అవర్లో మిగిలిన స్నేహితులందరికీ కథలా అల్లి మరీ వివరించాడు. ఇక ఆ రోజంతా నవ్వులే నవ్వులు.

ఇంటికెళ్లాక మోహన్రావ్ ఈ విషయం మీద తీవ్రంగా ఆలోచించాడు. కానీ అతని ఆలోచన తెగక ముందే హిమ నుంచి ఫోన్. కూతురితో మాట్లాడగానే అతనికి మనసంతా సంతోషం నిండి, తన సమస్య గురించి తాత్కాలికంగా మర్చిపోయాడు. మర్నాడు చాన్నాళ్ళయిందని తన చిన్ననాటి స్నేహితుడు శ్రీధర్‌కి ఫోన్ చేశాడు.

"నాన్నా, పనికిమాలినోడు ఫోన్ చేస్తున్నాడు ఫోన్ ఎత్తమాక.."

అవతల్నుంచి చిన్న కుర్రాడి గొంతు.

తల తీసేసినట్లయింది మోహన్రావుకి.

'ఇదేంటి కనీసం మర్యాద లేకుండా, అయినా శ్రీధర్‌కి ఇంత చిన్న కొడుకున్నాడా' అనుకుంటుండ గానే..

అవతల్నుంచి

"హలో!"

"హలో శ్రీధర్, నేన్రా. మోహన్రావుని."

"మోహన్..! ఏమిటీ హఠాత్తుగా. మొబైలెప్పుడు కొన్నావురా. ఎలావున్నావురా, ఎప్పుడూ ల్యాండ్‌లైన్‌నుంచే పోన్ చేస్తావు కదరా, అవునూ నా మొబైల్ నెంబరెలా దొరికింది"

"ఆ... అది లతా టీచర్ కూతురు ఇప్పుడు నా స్టూడెంట్. మొన్న కూతుర్ని చూడ్డానికి ఇక్కడికొస్తే కలిసాను. అప్పుడే నీ నంబర్ కూడా తీసుకున్నాను. అలా దొరికింది.

నువ్వేంటి ఇంకా ఆపరేషన్ చేయించుకోలేదా? ఇప్పుడెంత మంది పిల్లల్రా నీకు?" అడిగాడు, అతని మనసులో ఆ పిల్లాడు తనను పనికిమాలినోడు అన్నందుకు చాలా అక్కసుగా వుంది. శ్రీధరేంటి ఇలాంటి పెంపకమేమిటి? అనుకున్నాడు మనసులోనే.

'మోహన్రావుకిప్పుడీ డౌటేంటీ, చానాళ్ళకి ఫోన్ చేసి ఇదేనా అడిగేది? మరీ ఛాదస్తం పెరిగిపోయినట్లుంది' అనుకుంటూ

"మోహన్ నీకు ఇప్పుడెందుకొచ్చిందా సందేహం? నాకిద్దరు పుట్టాక ఆపరేషన్ చేయించుకున్నాను కదరా. ఇప్పుడు నాకో మనవడు కూడాను." అన్నాడు మోహన్రావు సందేహాన్ని నివృత్తి చేస్తూ.

"అవునా?? మరి ఆ పిల్లాడెవరురా? అలా మాట్లాడాడేంటీ? చిన్న పిల్లలు చిన్నపిల్లల్లాగుంటేనే ముద్దుగానీ." అన్నాడు మనసులో అక్కసు దాచుకోలేక.

విషయం అర్థమై అవతల్నుంచి కడుపు పట్టుకుని మరీ నవ్వాడు శ్రీధర్.


"ఏంరా అలా నవ్వుతావు? వాడేం అన్నాడో తెల్సా అసలు నీకు?" అన్నాడు వుడుక్కుంటూ.

"అరే సన్నాసీ. అది 'కాలర్‌ట్యూన్'. భలే నవ్వించావు కదరా, ఈ మధ్యకాలంలో ఇంత హాయిగా నవ్వనే లేదు. నీలాంటి వాళ్ళు ప్రతిచోట వుండాలిరా." అన్నాడు నవ్వుతూనే శ్రీధర్

"అసలేం అర్థం కావట్లేదు నాకు. ఇలాంటి తంటాలు వుంటాయంటే అసలు మొబైల్ కొనేవాడ్నే కాదురా." అన్నాడు మోహన్రావు వాపోతూ.

"మోహన్, నువ్వింకా తెల్సుకోవాల్సినవి చాలా వున్నాయి. ఎప్పటి కప్పుడు కొత్త జనరేషన్ని ఫాలో అవుతుంటే మనమూ ఎంజాయ్ చేయచ్చు. ఇప్పటికైనా ఆ పాత పుస్తకాల్లో తల దూర్చడం మాని నాలుగు విషయాలూ తెల్సుకుంటూ వుండరా" అని సలహా ఇచ్చాడు శ్రీధర్.

'కాలర్‌ట్యూన్' పెద్ద తలనొప్పిగా మారింది. అసలు నా ప్రమేయం లేకుండా నాకు ఇలాంటివన్నీ వినిపిస్తున్నందుకు న్యూసెన్స్ కేసు పెట్టొచ్చుకదా! అయితే స్నేహితులని ఏమనగలం. అందరికీ ఇలాంటి ఇబ్బందులున్నాయా, లేకపోతే నాకేనా? అసలు ఆ ట్యూన్స్ ఇచ్చిన సెల్‌ఫోన్ వాడి పైనే ఎగరాలి. అవును, అసలు వాళ్లీ ట్యూన్సూ గీన్సూ ఇవ్వకుండా వుంటే ఎవరూ ఇలాంటి వాటిని వినిపించి చంపరు కదా!' ఈ ఆలోచన న్యాయమనిపించి ఈ రోజే దీని సంగతి తేల్చేయాలని నిశ్చయించుకున్నాడు మోహన్రావ్. టిఫిన్ చేసి తిన్నగా ఫోన్ కనెక్షన్ కష్టమర్ కేర్ సెంటర్ కెళ్లి తన బాధను వెళ్ళ బోసుకున్నాడు.



"ఇందులో ఇబ్బందేముంది. సాధారణంగా మన ఫోన్ మోగితే ఏదైనా మ్యూజిక్‌గానీ, పాటగానీ సెలెక్ట్ చేసుకునే సదుపాయం లాగానే, మనకి ఫోన్ చేసినప్పుడు అవతలి వాళ్ళు ఫోన్ లిఫ్ట్ చేసేవరకూ ఏదైనా పాటగానీ, మాటలుగానీ అవతలి వాళ్ళకు వినిపించే సదుపాయం వుందిప్పుడు. దీన్నే 'కాలర్‌ట్యూన్' అంటారు. దానికి నెలకి కొంత డబ్బు మన అక్కౌంట్‌లో కట్ అవుతుంది. ఇప్పుడు ఇలాంటివి గమ్మత్తుగా చాలా వచ్చాయి. అలాగే మనకిష్టమైన పాటలుగానీ, మ్యూజిక్‌గానీ పెట్టుకోవచ్చు. ఇది వారి వారి అభిరుచిపై ఆధారపడి వుంటుంది సార్. అయినా డబ్బు కట్టింది వాళ్లయినప్పుడు మీకేంటి సార్ ఇబ్బంది?" అక్కడున్న అబ్బాయి.

"అయితే మాత్రం డబ్బిచ్చి అవతలి వాడ్ని వాయించడంలో ఆనందమేంటి? వినేది మనం కదా, ఉదాహరణకి నన్నే తీస్కో, నాకు 'అ అంటే అమలాపురం' అనే పాట వింటే కంపరం లేస్తుంది. మొన్నెవరికో ఫోన్ చేస్తే ఆ పాట విని

పించింది. వెంటనే ఫోన్ కట్ చేసేసాను. ఇంక మాట్లాడాలనే మూడ్ కూడా పోయింది. ఇలాంటివి చెప్పుకుంటే ఎన్నెన్నో. ఈ సమస్యల్ని ఇలా అనుభవించాల్సిందేనా? ఇలాంటి టోన్స్ మీరే ఇవ్వకుండా వుంటే జనాలకి ఇంత ఇబ్బంది వుండేది కాదుకదా!'' తన బాధకి వాళ్ళే కారణం అనే ఆరోపణతో అన్నాడు మోహన్రావు.

''మీరింకా ఏ జనరేషన్‌లో వున్నారండీ,



ఇలాంటివి కష్టమర్లు కోరుకోవడం వల్లే మేం ఇస్తున్నాం. ఇలాంటి వాటికోసం ఎంత డిమాండ్ వుందో మీకు తెలీదు. జనం కోరిక మేరకే కదా మేం పని చేయాల్సింది. మీలాంటి నలుగురైదు గురి కోసం వేలమందిని ఒదులుకోలేం కదండీ. అయినా ఎంచక్కా ఎంజాయ్ చెయ్యకుండా ఈ గొడవేంటి సార్, కావాలంటే మీ స్నేహితులనే ఆ 'కాలర్‌ట్యూన్స్'ని వినిపించొద్దంటే సరిపోతుంది కదా! ముందు వాళ్ళని అడిగి చూడండి మానేస్తారేమో ఆ తర్వాత రండి, ఇంకా చాలా మంది కష్టమర్లున్నారు, ఒక్కొక్కరితో ఇంతసేపు మాట్లాడాలంటే కుదరదు, మిగతావాళ్ళకి అవకాశమివ్వండి సార్''

అన్నాడా అబ్బాయి.

పొమ్మనలేక పొగపెట్టినట్లుంది అనుకుంటూ, ''అయితే నా సమస్యకి పరిష్కారం ఏంటి?'' అడిగాడు మోహన్రావ్

''ఇలాంటి విషయాల్ని మీరు పట్టించుకోకుండా వుండడమే. లేకపోతే ఫోన్ చేయడమే మానుకోండి. వేరే దారిలేదు సార్''. అన్నాడు ఆ అబ్బాయి విసుగ్గా.

ఆ అబ్బాయి చెప్పినట్లుగా ఫోన్ చేయడం మానేయాలా? అదే పరిష్కారమైతే మరి టెక్నాలజీ అందరికీ అందుబాటులో వుందని ఎలా అనుకోవాలి? అలాగని ప్రతి చెత్తా వింటూ వుండడం తన వల్ల కాదనుకుంటూ ఎటూ తేల్చుకోలేక ఇంటివేపు దారి తీస్తుంటే మెసేజ్ వచ్చింది. చూస్తే అందులో,

'కాలర్ ట్యూన్స్ కావాలా? మీకిష్టమైన వాటిని సెలెక్ట్ చేసుకుని ఫలానా నంబర్‌కి ఎస్సెమ్మెస్ చేయండి, నెలకి ముప్పై రూపాయలు మాత్రమే, ఆకర్షణీయమైన కాలర్‌ట్యూన్స్ మీ సొంతం' అని వుంది.

తలపట్టుకున్నాడు మోహన్రావ్.

★


చిరునామా:
నీలిమ
ఫస్ట్‌ఫ్లోర్, గౌరీ అపార్ట్‌మెంట్స్,
రిలయన్స్ మార్ట్ పక్కన,
కాకతీయ నగర్,
తిరుపతి.
సెల్:
9849966988